# ధర్మో రక్షతి

బేగంపేట రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం మీద తచ్చాడుతూ విసుగ్గా వాచ్ చూసుకుంది సురేఖ. రాత్రి పది గంటలయింది. తొమ్మిదిన్నరకు రావలసిన మెట్రో ట్రెయిన్ అంతవరకు రాలేదు. ఎంక్వైరీ చేస్తే పది నిముషాలలో వచ్చేస్తుందన్నారు. అరగంట నుంచీ ఎన్నిసార్లడిగినా అదే సమాధానం ఎప్పుడూ ఒకే మాట మీద నిలుస్తామన్నట్టు. పైగా ప్లాట్‌ఫాం మీద ప్యాసింజర్స్ పట్టుమని పదిమంది కూడా లేరు. అందులో ఆడపిల్ల తానొక్కతేనని గ్రహించి కించిత్తు భీతి కలిగింది.

మరోపక్క ఇంటి దగ్గర అమ్మ తనకోసం ఏం కంగారు పడుతుందోనన్న ఆందోళన. రోజూ రాత్రి ఎనిమిది గంటలకే ఇంటికి చేరుకునే తనకు ఆ రోజు అనుకోకుండా ఆలస్యం అయిపోయింది. ఇంట్లో టెలిఫోన్ సౌకర్యం లేనందున తన ఆలస్యం గురించి అమ్మకు చెప్పే అవకాశం లేకపోయింది. ఆమె తనకోసం ఎంత ఆందోళన చెందుతుందోనన్న కంగారు క్షణక్షణం పెరిగిపోతూంటే, ఆసహనంగా, పచార్లు చేస్తోంది.

ఇదిగో అదిగో అంటే ఓ గంట ఆలస్యంగా పదిన్నరకు వచ్చింది ట్రెయిన్. దారిలో ఇంజన్‌కి చిన్న రిపేర్ ఏదో వచ్చిందట మరి.

కట్టెదుట కనిపించిన కంపార్ట్‌మెంటులోకి హడావుడిగా ఎక్కేసి హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంది సురేఖ. ట్రెయిన్ కదిలాకగాని గ్రహించలేదామె ఆ కంపార్ట్‌మెంట్ అంతటికీ తాను ఒక్కతే ప్యాసింజర్‌నని.

పట్టపగలే ఖాళీగా వెళ్ళే మెట్రో ట్రెయిన్‌లో రాత్రి ఆవేళప్పుడు జనాన్ని ఎదురు చూడడం అవివేకమే అవుతుందనుకుంది. ఆ మధ్య ఏదో న్యూస్ పేపర్లో చదివింది తాను. రోజుకు సగటున మూడు లక్షల ట్రాఫిక్‌ని ఎదురుచూసే మెట్రోలో కేవలం పాతికవేలమంది మాత్రమే ప్రయాణిస్తున్నారనీ, అందువల్ల రైల్వేస్‌కీ నష్టాలు వస్తున్నాయనీను. అందుక్కారణం చాలినన్ని సిటీబస్‌లను మెట్రో స్టేషన్స్‌కి నడపకపోవడమేనంటూ రైల్వేస్



ఆర్.టి.సి.ని. బ్లేమ్ చేస్తే, స్టేషన్స్‌ని సిటీ రూట్సుకి బహుదూరంగా కట్టడమే హేతువంటూ ఆర్.టి.సి. చేతులు దులిపేసుకుంది. ఏది ఏమైతేనేం రైల్వేస్‌కీ, స్టేట్ ట్రాన్స్‌పోర్ట్‌కీ మధ్య సమన్వయం లోపించడం వల్ల కోట్లు ఖర్చు చేసి ఏర్పరిచిన ఆ ప్రెస్టేజియస్ ఫెసిలిటీ ప్రజలకు ఆశించినంతగా ఉపకరించలేకపోవడం దురదృష్ట కరమని అంగీకరించక తప్పదు.

సురేఖ కిటీకి దగ్గర కూర్చుని బైట దోబూచులాడుతున్న వెలుగు చీకట్లును తిలకిస్తూ వుండిపోయింది.

సురేఖకు పాతికేళ్ళుంటాయి. తెల్లగా, బొద్దుగా, ఆకర్షణీయంగా వుంటుంది. బీగంపేటలోని ఓ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తోంది.

నివాసం సికింద్రాబాద్. రైల్వే పాస్ తీసుకుని రోజూ మెట్రోలో వెళ్ళొస్తుంటుంది పనిలోకి.

కిటికీలోంచి వీచే చల్లటి గాలి శరీరానికి సేదదీర్చుతూంటే ముఖం తుడుచుకోవడానికి కర్చీఫ్ కోసం హ్యాండ్ బ్యాగ్ తెరిచింది. ఆమె అందులో కనిపించిన కాగితం చూసి నొసలు చిట్లిస్తూ బయటకు తీసింది. మడత విప్పి అసంకల్పితంగానే దాన్ని చదివింది. అలాగే చేతిలో పట్టుకుని సాలోచనగా కిటికీలోంచి దృష్టి సారించింది, ఆ సాయంత్రం జరిగిన సంఘటనలు తలపుకు తెచ్చుకుంటూ, ఆలోచనల్లో మునిగిపోయిన సురేఖ ట్రెయిన్ తరువాత స్టేషన్‌లో ఆగడంగాని, తిరిగి బయలుదేరడంగాని గమనించలేదు. ఎవరో నలుగురు యువకులు వచ్చి తన ఎదుట కూర్చున్నప్పుడుగాని స్పృహలోకి రాలేదామె.

ఆ యువకుల వయసులు ఇరవై, ముప్పయ్ మధ్య వుంటాయి.

సారా వాసన గుప్పుమనడంతో కర్చీఫ్‌తో ముక్కు మూసుకుంది. ఆ యువకుల పలుకులు, ప్రవర్తన, చూపులూ ఇబ్బంది పెట్టాయి. ఆ కంపార్ట్‌మెంట్‌లో తాను ఒక్కతే వుందన్న విషయం గుర్తుకొచ్చి కలవరపెట్టింది.

పట్టపగలే లోకల్ ట్రెయిన్స్‌లో ఆడవారిపైన అత్యాచారం జరిగిన సంఘటనలను గూర్చి అప్పుడప్పుడూ దినపత్రికలలో చదువుతూనే వుంది తాను. ముంబై కల్చర్ హైదరాబాద్‌కీ ప్రాకింది.



ఇప్పుడు లేట్ నైట్ కాక ఆ కంపార్ట్‌మెంట్‌లో ఒంటరిది తాను. పైగా ఆ యువకులు త్రాగి వున్నారు. ఏం జరిగినా తనను ఆదుకునే దిక్కుండదు. ఆలోచిస్తే గుండె గుభేల్‌మంది. భయం పెరిగి పోయింది.అది ఖాళీ కంపార్ట్‌మెంటని ఎరిగుండీ నెక్స్‌ట్ స్టేషన్‌లో మనుషులున్న కంపార్ట్ మెంట్‌కి మారనందుకు తనను తాను నిందించుకుంది. తరువాత స్టేషన్ వచ్చేంతవరకూ ఏమీ జరక్కూడదని మదిలోనే దేవుళ్ళకు మ్రొక్కుకుంది. తన భయాందోళనలు పైకి కనిపించకుండా ముఖం గాంభీర్యంగా పెట్టి బయటకు చూస్తూ బింకంగా కూర్చుంది.

అయితే సురేఖ భయపడినంతా జరిగింది. ఆ యువకులు అల్లరి ప్రారంభించారు. 'నువ్వే కావాలి' అంటూ ఒకడూ, 'నా మనసంతా నువ్వే' అంటూ మరొకడూ, 'నీకే మనసిచ్చా' అంటూ ఒంకొకడూ, 'పెళ్ళాడుదాం, రా' అంటూ వేరొకడూ... ఇలా సినిమా పేర్లతో పలుకరిస్తూ, కళ్ళు కొడుతూ, ఆసభ్య భంగిమలలో డాన్సులు చేస్తూ ఆమె చుట్టూ చేరి గొడవ చేశారు. అంతటితో ఆగకుండా మీద మీద పడుతూ చెయ్యొకడూ, చున్నీ ఒకడూ లాగుతూంటే మరొకడు చెంపలు తడుముతూ, ఇంకొకడు ముద్దు పెట్టుకోబోతూ ఆమెను వేధించసాగారు.

తన వద్దకు రావద్దంటూ బ్రతిమాలుకుంది సురేఖ. తనకు కారాటే వచ్చునంటూ బెదిరించింది కూడాను. అరచి గోల చేస్తానంది. ట్రెయిన్‌లోంచి దుమికేస్తానంది. ఫలితం లేకపోయింది. ఆ మాత్రానికే విడిచిపెడితే రౌడీలు ఎందుకవుతారు వాళ్ళు? మరింతగా వేధింపులు సాగించారు. వారి బారినుండి తప్పించుకొనేందుకు లేచి నిలుచుందామె.

అదిగో అప్పుడే పడింది వారి దృష్టి ఆమె చేతిలో వున్న కాగితం మీద.

"అంటీ చేతిలో లవ్ లెటర్ రోయ్" అంటూ ఆమె చేతి లోంచి కాగితం లాక్కున్నాడు ఒకడు. ఆమె దాన్ని వెనక్కి దాచేసుకోవడానికి ప్రయత్నించి విఫలమైంది.

టీజింగ్‌గా వాగుతూ నలుగురూ కలిసి ఆ కాగితంలోని మ్యాటర్ని కూతుహలంతో చదివారు.

అంతే నిప్పును ముట్టుకున్నట్టు కాగితాన్ని చటుక్కున వదిలేశారు. అందరి నిషా 'హుష్ కాకీ' అన్నట్టు సర్రున దిగిపోయింది. దాని స్థానే భీతి దేహమంతా జెర్రిగొడ్డులా ప్రాకసాగింది. కట్టెదుట కాలనాగును చూసినట్టు దూరంగా గెంతారు, ఆమె వంక భయం భయంగా చూస్తూ.

ముఖాలలో మృత్యుభీతి ప్రతిఫలిస్తూంటే 'అయ్‌బాబోయ్ ఎయిడ్స్ రోగిరా' అంటూ పోటీల మీద గుమ్మం వైపు పరుగెత్తారు. నెక్స్‌ట్ స్టాప్ వచ్చేంతవరకు అక్కడే వణికిపోతూ నిలుచున్నారు. ట్రెయిన్ స్టేషన్లో పూర్తిగా ఆగకుండానే కట్టగట్టుకుని ప్లాట్‌ఫాం మీదకు దుమికేశారంతా.

ఆ దుండగులు పలుకులు, ప్రవర్తన అమితాశ్చర్యాన్ని గొలుపుతూంటే, సీటు మీద పడ్డ కాగితం తీసి మరోసారి చదువుకుంది. సిటీలోని ఓ మెడికల్ డయాగ్నస్టిక్ సెంటర్ ఇచ్చిన టెస్ట్ రిపోర్ట్ అది. ఆర్నెల క్రితపు రిపోర్టు. అందులో అనిత అనే యువతికి హెచ్.ఐ.వి. పాజిటివ్ అనీ, ఆమెకు ఎయిడ్స్ వ్యాధి వుందనీ నిర్ధారణ అయినట్టు రాసి వుంది. ఆ యువకులు భయంతో సురేఖకు దూరంగా పారిపోవడానికి కారణం దాన్ని చదివి, అది సురేఖకు చెందినదేనని భావించడమే.

జరిగిందేమిటో అర్థమయ్యేసరికి సురేఖ ఆనందానికి అవధులు లేకపోయాయి. తన మానప్రాణాలను కాపాడిన ఆ రిపోర్టుని ముద్దుపెట్టుకుని, విస్మయంగా చూస్తూంటే, దాని వెనుకనున్న సంఘటన మదిలో మెదిలింది.

❄ ❄ ❄

ఆ రోజు సాయంకాలం ఇన్‌స్టిట్యూట్ నుంచి కొంచెం ముందుగానే బయటపడింది సురేఖ. రైల్వేస్టేషన్‌కి వెళుతూంటూ త్రోవలో ఓ చోట జనం గుంపుగా కనిపించడంతో ఏదో యాక్సిడెంట్ అయి వుంటుందనుకుంటూ చూడడానికి వెళ్ళింది.

ముప్ఫయ్యేళ్ళ స్త్రీ ఒకామె ఓరోడ్డు పక్కన తెలివిలేకుండా పడి వుంది. ఆమె తలకు దెబ్బ తగిలి రక్తం కారుతోంది. కాళ్ళూ, చేతులూ సన్నగా కంపిస్తున్నాయి.

అక్కడ చేరిన జనం చుట్టూ మూగి చోద్యం చూస్తూ తలో రకంగా వ్యాఖ్యానించడం తప్పితే, ఆమెకు వైద్య సహాయం అందజేయాలన్న ప్రయత్నమేమీ చేయడం లేదు.

ఆ దృశ్యంగాంచిన సురేఖ నొచ్చుకుంటూ, 'అదేంటండీ? ఎంతమంది వున్నారిక్కడ, ఒక్కరూ ఆమె గురించి ఆలోచించరేం? ఆలస్యం చేస్తే ప్రమాదం కదూ?" అంది నిష్ఠూరంగా.

"ఈమె ఎవరో, ఎందుకిలా పడిపోయిందో మనకెలా తెలుస్తుందమ్మా? అసలే ఆడకూతురు, ఏమైందో ఏమిటో? ఇలాంటి విషయాల్లో ఎలా తలదూర్చగలం?" అంటూ ఎవరికివారే మెల్లగా అక్కణ్ణుంచి జారుకోనారంభించారు.

బాధ్యతారహితమైన వారి ప్రవర్తనకు సురేఖకు వళ్ళు మండిపోయింది. అయినా ఎవర్ని, ఏమి అనగలదు?


వెంటనే ఆటో పిలిపించి, ఆ స్త్రీని అందులో ఎక్కించుకుని నర్సింగ్‌హోమ్‌కి తీసుకు వెళ్ళింది. ఆమెను ఎమర్జెన్సీ వార్డ్‌లో వుంచి వెంటనే ట్రీట్‌మెంట్ ఆరంభించారు డాక్టర్లు.

ఆ లోపున తాను తీసి జాగ్రత్త చేసిన ఆ స్త్రీ యొక్క హ్యాండ్ బ్యాగ్‌ని తెరిచింది సురేఖ, ఆమె వివరాలు ఏవైనా తెలుస్తాయేమోనని ఆమె చిరునామా తెలిస్తే వాళ్ళ వాళ్ళకు కబురు తెలుపవచ్చుననుకుంది. వాళ్ళు రాగానే తాను వెళ్ళిపోవచ్చునని తలపోసింది.

నిజానికి ఆ రోజు త్వరగా ఇంటికి వెళ్ళాలనుకుంది సురేఖ. తల్లికి ఆస్తమా వుంది. చలికాలం మొదలవుతోందేమో, జబ్బు తిరగబెట్ట సాగింది. అందువల్ల ఆ రోజు సాయంత్రం తల్లిని డాక్టర్ దగ్గరకు తీసుకు వెళ్ళాలనుకుంది. అందుకే పర్మిషన్ తీసుకుని త్వరగా బయలుదేరింది. కానీ, ఉదురు చూడని ఆ సంఘటనతో అక్కడ చిక్కుపడిపోయింది.


ఆ స్త్రీ యొక్క హ్యాండ్ బ్యాగ్ తెరిచి చూసిన సురేఖకు ఆమె పేరు అనిత అనీ, ఏదో వెల్ఫేర్ హోంలో వుంటోందనీ తెలిసింది. అయితే బ్యాగ్‌లో కనిపించిన మెడికల్ రిపోర్టు చూడడంతో గుండె ఆగినంతపనయింది. అనిత ఎయిడ్స్ రోగి అని గ్రహించడంతో భయం వేయలేదు, అంత

(మిగతా 22వ పేజీలో చూడండి)




## చాక్లెట్లిచ్చి పని చేయించుకున్నాడు!

విశ్వసుందరి ప్రియాంకాచోప్రాకి చాక్లెట్లంటే తెగ పిచ్చి. ఆ అలవాటు చిన్నప్పటి నుంచీ లేకపోయినప్పటికీ మోడలింగ్ రంగం నుంచి మూడ్ బాగా లేకపోతే చాలు, ఓ చాక్లెట్ తింటే దానంతటదే బాగైపోతుందట. హృతిక్‌రోషన్‌తో నటిస్తున్న ఓ సినిమా షూటింగ్ కోసం కులూ మనాలీ వెళ్ళిన అమ్మడు, ఓ షాట్ తీయడం కోసం బోలెడన్ని టేకులు తీసుకుందట. దాంతో ఆ చిత్ర డైరెక్టర్ ప్రియాంక ముందు ఓ ప్లేట్ నిండా చాక్లెట్లు తెచ్చి పెట్టి తినమన్నాడట. ఇష్టమైనన్ని చాక్లెట్లు తినడమయ్యాక ఒక్కసారికే షాట్ ఓకే అయిందట. అమ్మడి వీక్‌నెస్ బాగా తెలుసుకున్నట్లున్నాడా డైరెక్టర్.



# నిర్దోషిని కూడా పరిహారం చెల్లించమన్న సుప్రీమ్ కోర్టు




సుప్రీమ్ కోర్టు యిచ్చిన ఒక ఆశ్చర్యకరమైన న్యాయమైన తీర్పులోని విషయాలు పాఠకులకు చెప్పదలచి ఈ రచన చేయటమైనది.

ఆమె అతను పక్క పక్క యింట్లో నివసిస్తుండే వారు. అతను, ఆమెతో సరదాగా కబుర్లు చెబుతూ వుండేవాడు. ఆమెకు అతని ప్రవర్తన నచ్చేదికాదు. అయినా అతను ఆమెను విడిచిపెట్టేవాడు కాదు. ఆమెకు చేతి గడియారం కూడా బహుమతిగా యిచ్చాడు. నిన్ను పెళ్ళి చేసుకుంటాను అని అతను ఆమెను నమ్మించేవాడు. చివరికి ఆమె అతనికి లొంగిపోయింది. ఇదంతా 1988 వ సంవత్సరం ఫిబ్రవరి నెల నుండి జరగటం మొదలైంది. రెండో నెల లేక మూడో నెల గర్భంవచ్చిన తరువాత ఆమె ఆ సంగతి తన తల్లి, తండ్రులకు చెప్పింది. ఆమె తండ్రి అతన్ని తన కూతురిని పెళ్ళిచేసుకోమని కోరాడు. అందుకు అతను అంగీకరించి ఆ విషయం గ్రామ పెద్దల ఎదుట చెప్పాడు. కథ యిట్లా నడుస్తుండగా అతని తండ్రి అతన్ని ఆ గ్రామం నుంచి వేరేచోటికి పంపించేశాడు. ఆ కుర్రాడు ఎక్కడ వున్నదీ ఎవరికీ తెలియరాలేదు. గత్యంతరం లేక ఆమె పోలీసులకు రిపోర్టు యిచ్చింది. పోలీసులు విచారించి అతనిపై ఛార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారించిన జడ్జి అతనికి పది సంవత్సరాలు కఠిన జైలుశిక్ష విధించారు. ఈ శిక్ష ఐ.పి.సి.లోని సె.376 క్రింద విధించబడింది. అంటే రేప్ నేరానికి హైకోర్టు శిక్ష 7 సంవత్సరాలు తగ్గించింది. అతను సుప్రీమ్ కోర్టును ఆశ్రయించాడు.

ఈ కేసులో కీలకమైన విషయం ఆమె వయస్సే. అతను, ఆమెతో మొదటిసారి సంభోగించినప్పుడు ఆమె వయసు 16 సంవత్సరాలకన్నా లోపు అనే విషయం కర్టులో సరిగా నిర్ధారించబడలేదు అన్నది సుప్రీమ్ కోర్టు. స్కూలు సర్టిఫికెట్, డాక్టరు సర్టిఫికెట్ కోర్టులో వున్నప్పటికీ, వాటి ద్వారా ఆమె వయస్సు 16 సంవత్సరాలకన్నా లోపు అనే విషయం నిర్ధారింపబడలేదు. ఆమె సాక్ష్యంలో అనేక విషయాలు చెప్పింది. 16 సం॥ లోపు బాలిక అంగీకారం పొంది సంభోగించినా అది రేప్ నేరమే అవుతుంది. అందువల్ల ఈ కేసు విచారించటానికి వయస్సు అంగీకారం అనే అంశాలు ప్రాధాన్యత వహించాయి. వయస్సు 16 లోపు అని నిర్ధారించ లేక పోయింది ప్రాసిక్యూషను.

సరే ఇక అంగీకారం అనే విషయంపై చర్చించింది. సుప్రీమ్‌కోర్టు. ఈ అంశంపై ఈ కేసులో సుదీర్ఘమైన చర్చ జరిగింది. అంగీకారం అనే పదం ఐ.పి.సి.లోని సె.90 లో వివరించబడింది. ఈ కేసులో ఆమె సాక్ష్యం పరిశీలిస్తే సంభోగం అనేది ఆమె అంగీకారం లేకుండా జరిగినట్లు కనబడదు. ఈ చర్చ పర్యవసానం ఆమెకు తెలుసు అని అర్థమవుతున్నది ఆమె సాక్ష్యం వల్ల. కనుక ఆమె అంగీకారం లేకుండా సంభోగం అనేది జరిగి వుండదు అని భావించింది సుప్రీమ్ కోర్టు.

వయస్సు 16 లోపు అని నిర్ధారణ కాలేదు. ఆమె అంగీకారం లేదు అని చెప్పటం సాధ్యం కాదు. అందువల్ల అతను నేరస్తుడు కాదు అన్నది సుప్రీమ్‌కోర్టు. విచారణ కోర్టు, హైకోర్టు తీర్పులను కొట్టివేసింది. అంటే అతను నిర్దోషి అన్నమాట.

బెనిఫిట్ ఆఫ్ డౌట్ క్రింద అతను నిర్దోషి అని తీర్మానించినప్పటికీ అతను, ఆమెను వివాహం చేసుకుంటాను అని ప్రామిస్ చేశాడు కదా! దీనివల్ల ఆమె గర్భవతి అయింది. అతను నమ్మకద్రోహం చేశాడు అనేది కాదనలేని విషయం కనుక అతను ఆమెకు నష్టపరిహారం చెల్లించే విషయం గురించి అతని లాయరు అడిగారు సుప్రీమ్ కోర్టు జడ్జీలు. అయ్యా అతనికి వివాహమైంది, యిద్దరు పిల్లలు. ఈ కేసులో రెండు సం॥ జైల్లో వున్నాడు. అతను పెద్దగా వున్నవాడు కాదు, మరియు అతను వెనుకబడిన వర్గానికి చెందినవాడు. దయచూపండి అని అతని తరపు లాయరు కోరాడు. ఇంకో విషయం ఏమిటంటే ఇతనివల్ల ఆమెకు పుట్టిన బిడ్డకు 14 సం॥ వయస్సు ఆమె తల్లితోనే వుంటోంది. మరియు ఆమెకు కూడా వివాహమైంది అని కోర్టులో విన్నవించబడింది. అతను ఆమెకు యాభై వేలు యిచ్చుకోటానికి సిద్ధంగా వున్నాడు అని కోర్టులో చెప్పాడు లాయరు.

యాభై వేలు తక్కువే. కానీ అతని పరిస్థితిని దృష్టిలో వుంచుకొని అతన్ని యాభై వేలు కట్టమనండి. ఇందులో పది వేలు ఆమెకు, మిగిలినది ఆమె బిడ్డకు చెందాలి అని తీర్పు యిచ్చింది సుప్రీమ్ కోర్టు.

నిర్దోషిని నష్టపరిహారం చెల్లించమనటం ఆమెకు, అతనికి వేరు వ్యక్తులతో వివాహం జరగటం, అతనివల్ల ఆమెకు కలిగిన బిడ్డకు 14 సం॥ల తరువాత కేసు ఫైనల్ అవటం ఆశ్చర్యంగా లేదు. ఏది ఏమైనప్పటికీ సుప్రీమ్ కోర్టు ఆమెకు న్యాయం చేసింది. (2005(1) ఎ.ఎల్.డి.) (సి.ఆర్.ఎల్) 65 (ఎస్.సి)

❋

---

చిన్న వయసులో అంతటి భయంకర రోగం బారినపడ్డందుకు ఆ స్త్రీ పట్ల విపరీతమైన జాలితో మనసంతా నిండిపోయింది.

"సడెన్‌గా ఫెయింటయ్యి కింద పడడం వల్ల తలకు బలంగా గాయమైంది. అందువల్ల చాలా రక్తం పోయింది. మరో పది నిముషాలు ఆలస్యం చేస్తే ఆమె దక్కేది కాదు. ఆమెకు ఏమీ కాకపోయినా సమయానికి తీసుకువచ్చి ఆమె ప్రాణం కాపాడారు' అంటూ ప్రశంసిస్తున్న డాక్టర్స్‌కి, నిస్తేజంగా ఆ రిపోర్ట్‌ని చూపించింది.

సురేఖ ఫోన్‌కాల్ అందుకుని వెల్ఫేర్ హోం నుంచి యాభై ఏళ్ళ స్త్రీ ఒకామె నర్సింగ్‌హోంకి వచ్చింది. అనితకు ఎయిడ్స్ అని తెలియగానే అయినవాళ్ళు కూడా ఆమెను ఇంటి నుంచి గెంటేశారనీ, ఓ సోషియల్ వర్కర్ పుణ్యమా

## ధర్మో రక్షతి కథ

(6వ పేజీ తరువాయి)

అంటూ ప్రముఖ ఎన్.జి.వో.కి చెందిన ఆ వెల్ఫేర్ హోంలో ఆమెకు ఆశ్రయం లభించిందనీ ఆలకించిన సురేఖ మనసంతా చేదు తిన్నట్టయిపోయింది. ఇక అక్కడ వుండలేకపోయింది.

అప్పటికే రాత్రి తొమ్మిదయిపోయింది. ఇంటి దగ్గర తల్లి తన కోసం కలవరపడుతూంటుంది. అనిత ఇంకా అపస్మారక స్థితిలోనే వుంది. కలతబారిన మనసుతో నర్సింగ్ హోం నుంచి బయటపడింది సురేఖ. హడావుడిగా రైల్వే స్టేషన్‌కి చేరుకుతంది.

ట్రెయిన్ ఎందుకో పెద్దగా విజిల్ వేయడంతో పులిక్కిపడి ఆలోచనల్లోంచి బయటపడింది సురేఖ. గాలికి చేతిలో రెపరెపలాడుతూన్న కాగితం వంక చూసింది. డాక్టర్స్ సలహా మేరకు దాన్ని ఎప్పుడూ దగ్గరే వుంచుకుంటుందట అనిత. దాన్ని మళ్ళీ అనిత బ్యాగ్‌లో పెట్టేయడం మరిచిపోయి, హడావిడితో తన బ్యాగ్‌లో పెట్టేసుకుంది తాను. ఇప్పుడు అదే తనను కాపాడింది. అనిత ఎయిడ్స్ ఆపదలో తన ఎయిడ్‌కి వచ్చింది.. ఎంత విచిత్రం అనుకుంది.

ట్రెయిన్ సికింద్రాబాద్ స్టేషన్ చెరుకోవడంతో దిగింది సురేఖ. స్టేషన్ బయటకు వచ్చి సాలోచనగా ఇంటివైపు నడుస్తూ 'నేను అనితను రక్షిస్తే అనిత మెడికల్ రిపోర్ట్ నన్ను రక్షించింది' అనుకుని విస్తుపోయింది ఆనందమూ, ఆశ్చర్యమూ ముప్పిరిగొనగా.

❋